15 మంది అభ్యర్థుల గైర్హాజరు



పరీక్షా కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం మొదటిరోజు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షను నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మరోవైపు పరీక్ష కేంద్రం వద్ద పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నరేంద్ర కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. ఆర్జీఎం కళాశాలలో గురువారం ఉదయం 60 మంది అభ్యర్థులకుగాను 9 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 60 మందికిగాను ఆరుగురు గైర్హాజరైనట్లు



అభ్యర్థిని హాల్‌టికెట్ పరిశీలిస్తున్న సిబ్బంది

ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం తెలిపారు.

దసరాకు 79 ప్రత్యేక బస్సులు



నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు 79 ప్రత్యేక సర్వీసులు నడపాలని నిర్ణయించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వీటిని తిప్పనున్నారు. ఆళ్లగడ్డ 11, ఆత్మకూరు 10, బనగానపల్లి 11, కోవెలకుంట్ల 12, డోన్ 10, నంద్యాల డిపో పరిధిలో 25 ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

రిజర్వేషన్ సౌకర్యం

ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. ఏపీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా ముందస్తుగా టికెట్ తీసుకొనే సదుపాయం కల్పించారు. వీటికి సాధారణ ఛార్జీలు ఉంటాయి. రద్దీకి అనుగుణంగా బెంగళూరు, విజయవాడకు బస్సులు నడుపుతారు. రాకపోకలకు కలిపి ఒకేసారి ముందస్తుగా రిజర్వేషన్ చేసుకుంటే ఛార్జీలో 10 శాతం రాయితీ ఉంటుంది.

ప్రత్యేక బస్సుల వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు

ఆళ్లగడ్డ	:	83319 76628
ఆత్మకూరు	:	0851 7224000
బనగానపల్లి	:	0851 5227670
డోన్	:	99592 25809
కోవెలకుంట్ల	:	85102 25505
నందికొట్కూరు	:	73828 25799
నంద్యాల	:	94414 86403

రద్దీకి అనుగుణంగా సర్వీసులు

– రజియాసుల్తానా, ఆర్టీసీ ఆర్ఎం, నంద్యాల

దసరా సందర్భంగా నంద్యాల జిల్లాలో 79 ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిన్ని అదనపు సర్వీసులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

పనుల పురోగతిపై శ్రద్ధ అవసరం : కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధి పథకం కింద నిర్దేశించిన పనుల్లో పురోగతిపై శ్రద్ధ చూపాలని ఎంపీడీవోలు, ఏపీవోలు, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం డ్వామా పీడీ జనార్దన్‌రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. లేబర్ బడ్జెట్ మొబలైజేషన్‌లో నందికొట్కూరు, దొర్నిపాడు, అవుకు, ఉయ్యాలవాడ తదితర మండలాలు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయన్నారు. ఉద్యాన తోటల సాగులో గడివేముల, ప్యాపిలి, డోన్, బేతంచెర్ల తదితర మండలాలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయన్నారు.




సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

జలకలే

- పూర్తిస్థాయిలో బోర్లు వేయించని గత వైకాపా సర్కారు
- బిల్లుల బకాయిలతో ఆగిపోయిన పథకం

మెట్ట ప్రాంత రైతుల ప్రయోజనార్థం అమలు చేసిన వైఎస్సార్ జలకళ పథకం వైకాపా ప్రభుత్వ తీరుతో నీరుగారిపోయింది. వైకాపా మద్దతుదారుల పొలాల్లో మాత్రమే బోర్లు వేయడంపై శ్రద్ధ చూపారు. అర్హులైన పేద రైతులను గాలికొదిలేశారు. మరోవైపు ఈ పథకం అమలులో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయి. డ్వామా అధికారుల పర్యవేక్షణ లోపంతో చాలాచోట్ల పథకం గాడి తప్పింది. కొన్నిచోట్ల వేసిన బోర్లకు బిల్లులు రాకపోవడంతో మిగతా పనులు ఆగిపోయాయి.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2020, సెప్టెంబరు 28న వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గంలో 500 బోర్లు వేసేలా గత వైకాపా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. మొదటి ఏడాది నిర్దేశించిన లక్ష్యంలో 50 శాతం కూడా పురోగతి సాధించలేదు. 2022 మార్చి నాటికి ఉమ్మడి జిల్లాలో 1,522 బోర్లు వేయగా.. అందులో 1,323 వరకు వినియోగంలోకి తెచ్చారు. పథకాన్ని ప్రారంభించిన 32 నెలలకు కేవలం 33 బోర్లకు మాత్రమే విద్యుత్తు సౌకర్యం కల్పించారు.



రూ.6 కోట్ల వరకు..

జలకళ పథకం కింద నంద్యాల జిల్లాలో 3,541 మంది రైతుల పొలాల్లో బోర్లు వేసేందుకు సర్వే చేశారు. పరిపాలన అనుమతి ఇచ్చేసరికి పది శాతం లబ్ధిదారులపై కోత విధించారు. గిరిజన గ్రామాల్లో బోర్లు మంజూరు చేసి హడావుడి చేసినా పూర్తిస్థాయిలో వేయలేదు. నిబంధనల మేరకు రైతు పొలంలో 200 అడుగుల లోతు బోరు తవ్వాలి. అప్పటికీ నీళ్లు పడకపోతే ఇంకా లోతు వేసేందుకు అయ్యే ఖర్చును రైతులే భరించాలి. ఇలా కూడా అన్నదాతలపై భారం మోపారు. కొందరి పొలాల్లో బోర్లు వేసినా మోటార్లు అమర్చలేదు. మరికొన్నిచోట్ల విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో బోర్లు నిరుపయోగంగా మారాయి. నంద్యాల జిల్లాలో బోర్లు వేసిన గుత్తేదారులకు రూ.6 కోట్లు, కర్నూలు జిల్లా పరిధిలో సుమారు రూ.5 కోట్ల వరకు బిల్లుల బకాయిలు ఉండటంతో బోర్లు వేయడం ఆపేశారు.

విద్యుత్తు కనెక్షన్ల భారం రైతులపైనే

జలకళ కింద వేసిన బోర్లకు సంబంధించి విద్యుత్తు కనెక్షన్‌కు అయ్యే ఖర్చులు లబ్ధిదారులే భరించాలని అధికారులు చెప్పారు. కనెక్షన్ తీసుకున్నాక మోటార్లు ఇస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గడివేముల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, బేతంచెర్ల, డోన్, ప్యాపిలి, పాణ్యం, ఆత్మకూరు, మిడుతూరు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల్లో 964 బోర్లు మంజూరు చేశారు. వీటిలో కొన్ని బోర్లు వేసినా బిల్లులు మాత్రం చెల్లించలేదు. దీంతో రెండేళ్ల కిందటే ఈ పథకం అమలు నిలిచిపోయింది.

గిరిజన గ్రామాల్లో హడావుడే..

గిరిజనుల పొలాల్లో బోర్లు వేయించి వారికి జీవనోపాధి కల్పిస్తున్నట్లు అప్పటి ప్రజాప్రతినిధులు చెప్పారు. ఒక్క గ్రామంలో కూడా బోర్లు అందుబాటులోకి రాలేదు. నల్లమల అటవీ ప్రాంతంలోని డి.వనిపెంట, పెచ్చెరువు, తమ్మరాజుపల్లె, గాజులపల్లె ఆర్ఎస్, ఎల్‌కే తండా తదితర గ్రామాల్లో బోర్లు వేయాలని నిర్ణయించారు. గిరిజనులు విద్యుత్తు కనెక్షన్ల కోసం రూ.వేలల్లో ఖర్చు పెట్టే పరిస్థితి లేకపోవడంతో ఇక్కడ పథకం గాడితప్పింది. మరికొన్నిచోట్ల బోర్లు మంజూరు చేయిస్తామని గ్రామ నాయకులు కొందరు రైతుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

★ గడివేముల, మిడుతూరు, పాణ్యం, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల మండలాల్లో కొన్ని గ్రామాల్లో 200 అడుగుల లోతులో బోర్లు వేయకపోయినా వేసినట్లు బిల్లులు చేసుకున్నారు. డ్వామా అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో చాలాచోట్ల అక్రమాలు చోటుచేసుకున్నాయి. పథకం పూర్తిగా వైకాపా నాయకుల కనుసన్నల్లో నడిచింది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

- నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో జలకళ కింద 30 బోర్లు వేశారు. వాటికి విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అలంకారప్రాయంగా మారిపోయాయి. బోర్లకు బిల్లులు చెల్లించేందుకు వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.
- గడివేముల మండలం గడివేముల, ఎల్‌కే తండా గ్రామాల్లో వేసిన బోర్లకు బిల్లులు రాలేదని గుత్తేదారు వదిలిపెట్టి వెళ్లిపోయారు.
- జిల్లా వ్యాప్తంగా 460 పంపుసెట్ల మంజూరుకు పరిపాలన అనుమతి వచ్చినా ఇంతవరకు 210 మాత్రమే అమర్చారు. ఈ పంపుసెట్లకు సంబంధించి రూ.2.74 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చెబుతున్నా అంత మొత్తంలో నిధులు విడుదల కాలేదు.

భృంగి వాహనంపై దేవదేవుల విహారం



తలపై దీపాలు పెట్టుకుని నృత్యం చేస్తున్న కళాకారిణులు



శ్రీకృష్ణదేవరాయ గోపురం వద్ద పుష్పాలంకరణ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశశక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైలంలో దసరా మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు దంపతులు, అర్చకులు, వేద పండితులు భ్రమరాంబాదేవికి పసుపు, కుంకుమ, ఫలాలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈవో, అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రారంభ పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆలయ వేదికపై భ్రమరాంబాదేవి అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లు భృంగి వాహనంపై కొలువుదీరారు. వర్షం కారణంగా గ్రామోత్సవం రద్దు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో జరిగే ఉత్సవాల దృశ్యాలను పురవీధుల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపై భక్తులు వీక్షించారు. సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.



ఉత్సవమూర్తులకు మంగళహారతులు ఇస్తున్న ప్రధానార్చకులు

దసరా ఉత్సవాల్లో నేడు..

శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాత్రి 7 గంటలకు భ్రమరాంబాదేవి భక్తులకు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. ఉత్సవమూర్తులకు మయూర వాహనసేవ జరగనుంది.

మల్లన్న లడ్డూ ప్రసాదాల తనిఖీ


శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో లడ్డూ ప్రసాదాలను జిల్లా ఆహార భద్రతాధికారులు షేక్ కాశీం వలి, ఓ.బి.రాయలు గురువారం తనిఖీ చేశారు. ఆలయ ప్రాంగణంలోని పోటుతో ప్రసాదాల తయారీ, వెలుపల విక్రయ కేంద్రాల్లో లడ్డూలను పరిశీలించారు. వాటి నాణ్యతపై ఆరా తీశారు. సిద్ధరామప్ప దుకాణ సముదాయం పక్కన ఉన్న గణేశ్ హోటల్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి, ఇతర సరకుల నమూనాలను గతవారంలో హైదరాబాద్‌లోని నాచారం ఫుడ్ ల్యాబొరేటరీకి పరీక్షల కోసం పంపినట్లు అధికారులు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. పనితీరు మెరుగుపరుచుకుని వచ్చే వారంలో పురోగతి చూపాలని గృహ నిర్మాణ శాఖ డీఈ, ఏఈలకు సూచించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఈఈ శ్రీహరిగోపాల్‌తో కలిసి గురువారం సమీక్షించారు. రుద్రవరం, పాములపాడు, గడివేముల, ప్యాపిలి తదితర మండలాల్లో 30 శాతం కన్నా తక్కువగా పురోగతి ఉందన్నారు. గృహ నిర్మాణాలపై ఎంపీడీవోలు శ్రద్ధ చూపాలన్నారు. పూర్తయిన ఇళ్లకు 68 శాతం మేరకే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయని చెప్పారు.

జలాశయం నీటిమట్టం 881.30 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 881.30 అడుగులు, నీటి నిల్వ 195.2102 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ పరివాహక ప్రాంతమైన జూరాల ప్రాజెక్టు నుంచి 67,045 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 25,458 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



కొనుగోళ్లకు సై

నాలుగుచోట్ల సీసీఐ కేంద్రాల ఏర్పాటు

పత్తి కొనుగోళ్లకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. కర్నూలు జిల్లా పరిధిలో ఆదోనితోపాటు ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడు ప్రాంతాల్లో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయి. మొదట్లో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించినా నాలుగింటికి మాత్రమే అనుమతి వచ్చింది. వ్యవసాయ మార్కెట్ యార్డు కేంద్రాల్లోకాక పత్తి జిన్నింగ్ పరిశ్రమల్లో కొనుగోలు కేంద్రాలను త్వరలో తెరవనున్నారు.

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే



ఉమ్మడి జిల్లాలో 2.70 లక్షల హెక్టార్లలో పత్తి సాగైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో కర్నూలు జిల్లా పరిధిలో 2 లక్షల హెక్టార్లు సాగవగా.. నంద్యాల జిల్లాలో 7 వేల హెక్టార్లకు మించలేదు. ప్రస్తుతం పత్తి కొనుగోళ్లకు సీసీఐ ఆసక్తి చూపడంతో ధరల పెరుగుదలపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. 2024-25 సంవత్సరానికి పత్తికి ఇచ్చే మద్దతు ధరను సీసీఐ ప్రకటించింది. పొడుగు పింజ రకానికి క్వింటా రూ.7,521, పొట్టి పింజకు రూ.7,121గా నిర్ణయించింది. 2023-24లో మొదటి రకానికి రూ.7,020, రెండో రకానికి రూ.6,620 ప్రకటించింది. ఈ ఏడాది క్వింటాపై రూ.501 పెంచింది.

ముందస్తుగా నమోదు

రైతులు తమ సమీపంలోని సచివాలయం, రైతు సేవా కేంద్రాల్లో ముందస్తుగా సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి. నమోదైన తర్వాత కొనుగోలు తేదీ, ఏ కేంద్రానికి వెళ్లాలో.. వివరాలు అందుతాయి. రైతులు ఆరోజు పత్తిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. గతంలో పత్తి రైతులంతా కేంద్రాల వద్ద బారులుదీరి నిలిచేవారు. ఫలితంగా గంటలు, రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. వాహనాల అద్దె, నిర్వహణ ఖర్చులన్నీ భరించాల్సి వచ్చేది. ప్రస్తుతం సులువుగా అమ్మకాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ధర నేలచూపు

ప్రస్తుతం విపణిలో పత్తి ధరలు నేలచూపు చూస్తున్నాయి. పదిహేను రోజుల కిందట పత్తి ధరలు క్వింటా రూ.8,200 వరకు పలికింది. ఈ నేపథ్యంలో మంచి ధరలు ఉంటాయని అందరూ ఆశించారు. కొన్ని రోజులకే ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం క్వింటా గరిష్ఠ ధర రూ.7,677 వరకు పలుకుతోంది. క్వింటాపై సరాసరిన రూ.500-700 వరకు తగ్గడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అతివృష్టి, అనావృష్టితో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. దీనికితోడు అప్పుడప్పుడూ వర్షాలు పడుతుండటంతో పొలాల్లో పత్తి తడిసి రంగు మారుతోంది. చీడపీడల సమస్య నెలకొంది. ఎలాగోలా వీటన్నింటినీ అధిగమించి విపణికి పత్తి తీసుకొచ్చినా ఆశించిన ధర లభించడం లేదు. బహిరంగ మార్కెట్లో పలుకుతున్న పత్తి ధరకు దగ్గరగా సీసీఐ మద్దతు ధర ఉండటంతో ఈసారి విపణిలో పోటీ పెరిగి మంచి ధరలు లభించే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు.



నవోదయం 2.0

■ నాటు సారా నిరోధించేలా ప్రణాళిక

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నాటుసారా పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు మద్యనిషేధ, ఆబ్కారీ శాఖ కసరత్తు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ నవోదయం 2.0 అమలు చేసి నాటుసారా నిరోధించాలని ఆదేశించిన నేపథ్యంలో ఆశాఖ చర్యలకు సన్నద్ధమవుతోంది. జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఉమ్మడి జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. సారా ప్రభావిత ప్రాంతాలను సారా రహిత ప్రాంతాలు తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రెండుగా విభజించి..

రెండుగా విభజించి, ఆబ్కారీ శాఖను రెండుగా విభజించి ఆ శాఖను బలహీనపర్చడంతో నాటుసారా రాష్ట్రంలో చర్యలు కొరవడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు మద్యం దుకాణాలను ప్రభుత్వ మద్యం దుకాణాలుగా మార్చి ధరలను అమాంతం పెంచేసింది. మద్యం ధరలు ప్రియం కావడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారింది. దీంతో సదరు మందుబాబులు మళ్లీ నాటుసారా తాగటం అలవాటు చేసుకున్నారు. సారా తాగేవారి సంఖ్య పెరగడంతో మళ్లీ తాండాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు పెరిగాయి. పల్లెలు, పట్టణ ప్రాంతాలకు అక్రమ రవాణా చేశారు. చిత్తూరు జిల్లా నుంచి లారీల కొద్దీ బెల్లం దిగుమతి అయ్యేది. కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా నాటుసారా దిగుమతి అయ్యేది. నాటు సారా అదుపు చేయలేని స్థాయికి విస్తృతమైంది.

సం॥	నాటుసారా కేసులు	స్వాధీనం చేసుకున్న సరకు (లీటర్లలో)
2023	577	6873
2024	746	9246

(జులై నెలాఖరు వరకు)

ముంచెత్తిన మద్యం

ఎన్నికల సమయంలో నాటు సారా ఏరులై పారింది. నాటుసారా కారణంగా చాలా మంది ప్రాణాలు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఆబ్కారీ శాఖ అధికారులు

కోల్పోయారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నాసిరకం మద్యం విక్రయించడంతోపాటు వాటి ధరలు పెంచడంతో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణా పెరిగింది. ఆబ్కారీ శాఖ అక్రమ మద్యం నియంత్రించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడంతో నాటుసారాపై చర్యలు కొరవడ్డాయి. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో పోలీసులు నాటుసారాను పట్టించుకోలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో వైకాపా ప్రభుత్వం నాటుసారా నిర్మూలించేందుకు అమలు చేసిన 'ఆపరేషన్ పరివర్తన' సఫలం కాలేకపోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం హానికరమైన నాటుసారా నిర్మూలనకు ప్రాధాన్యమిస్తూ నవోదయం పునఃప్రారంభించాలని ఆబ్కారీ శాఖను ఆదేశించింది. దాడులు, అవగాహన సదస్సులు, ప్రత్యామ్నాయ ఉపాధితో నాటుసారా నిర్మూలించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్న ఆ శాఖ నూతన మద్యం పాలసీ అమలు ప్రక్రియ పూర్తయిన వెంటనే నవోదయంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించనుంది.

ఆపరేషన్ పరివర్తన విఫలం

ఉమ్మడి జిల్లాలో 14 మద్య నిషేధ, ఆబ్కారీ స్టేషన్ల పరిధిలో 180 నాటుసారా ప్రభావిత ప్రాంతాలున్నాయి. సారా తీవ్రతను బట్టి మూడు విభాగాలుగా విభజించారు. తీవ్ర స్థాయి సారా ప్రభావమున్న ప్రాంతాలను 'ఏ' కేటగిరీగా పరిగణించారు. ఇందులో 30 ప్రాంతాలున్నాయి. కర్నూలులోని బంగారుపేట, ఎర్రకత్వతాండా, గుడుంబాయితాండా, నందికొట్కూరు, కోళ్లబాపురం, ఆదోని, ఆరికెరతాండా, నెర్నికితాండా, కొత్తపేట, జేఎంతాండా, ప్లెండ్లిమర్రి, రోళ్లపాండుతాండా, నంద్యాల, వైకేతండా, ఎల్‌కేతండా, నెమళ్లకుంట, సుగాలిమెట్ట, నారాపురెడ్డికుంట, పాణ్యం చెంచు కాలనీ, చిన్నరాజుపాలెం తాండా, పుసుపులతండా, గడ్డివేకలపల్లి, ఇస్రానాయక్‌తండా, కొండమనాయునిపల్లె, పిక్కలపల్లి, సీతమ్మతండా, అలెబతండా, ముద్దవరం, యల్‌బండతండా, సిద్ధాపురం ఉన్నాయి. బీ కేటగిరీ 41, సీ కేటగిరి కింద 109 ప్రాంతాలున్నాయి. 2019 ముందు తెదేపా ప్రభుత్వం సారా నిర్మూలనకు నవోదయం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దాడులు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవటం, అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యపరిచారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి నాటుసారా తయారీకి దూరం చేశారు. పలు ప్రాంతాలను సారా రహిత ప్రాంతాలుగా ప్రకటించారు. అయితే వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత నవోదయం పేరును ఆపరేషన్ పరివర్తనగా మార్చింది.

మంత్రి లోకేశ్‌కు రూ.3.92 లక్షల అందజేత



లోకేశ్‌కు చెక్కులు అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం సీఎం నిధికి నంద్యాల దాతలు అందజేసిన విరాళాల చెక్కులను న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. విజయవాడలో గురువారం ఆయన లోకేశ్‌ను కలిసి నాలుగో విడతలో రూ.3.92 లక్షల విలువచేసే చెక్కులు అందించారు.

అంగన్‌వాడీ గుడ్డు తిని చిన్నారికి అస్వస్థత



అంగన్‌వాడీ కార్యకర్తతో వాదిస్తున్న బాధితులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చిన గుడ్డు తిని ఓ చిన్నారి వాంతులు చేసుకొని అస్వస్థతకు గురికావడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు అంగన్‌వాడీ కార్యకర్తతో గురువారం గొడవకు దిగారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్లలోని అంగన్‌వాడీ కేంద్రం-7 పరిధిలో ఉన్న విజయకుమారి ఈనెల 1న కేంద్రానికి వచ్చి 25 కోడిగుడ్లు తీసుకెళ్లారు. ఇంటికి వెళ్లాక నాలుగేళ్ల కుమార్తె సిరికి ఉడికించిన గుడ్డు తినిపించడంతో వాంతులు చేసుకొని అస్వస్థతకు గురైంది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. గుడ్డు వల్లే ఇలా జరిగిందని వైద్యులు చెప్పినట్లు తెలిపారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన బాధితులు 2న గాంధీ జయంతి సందర్భంగా సెలవు కావడంతో గురువారం కేంద్రానికి మిగిలిన గుడ్లను తీసుకెళ్లి అంగన్‌వాడీ కార్యకర్తతో వాదనకు దిగారు. తమకు ఇచ్చిన గుడ్లు చెడిపోయాయని, పాత నిల్వలను పంపిణీ చేయడంతో తమ కుమార్తె వాంతులు చేసుకుందన్నారు. గుత్తేదారుడు సరఫరా చేసిన గుడ్లనే ఇచ్చామని, మీతో పాటు మిగిలిన వారికి ఇచ్చామని ఎవరికీ ఎలాంటి సమస్య రాలేదని అంగన్‌వాడీ కార్యకర్త జయమ్మ ఆమెకు తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలు ఆరంభం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఆరంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు గురువారం దిగువ అహోబిలంలోని ఆలయ ముఖద్వార మండపంలో ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుంచి పంచామృతాలతో అభిషేకం జరిపారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారిపల్లిని విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మఠియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.



స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

శైలపుత్రి అలంకారంలో చౌడేశ్వరిదేవి

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరంలో ఆలయాధికారిణి కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో గురువారం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిస్తారని ఆలయాధికారిణి తెలిపారు.



జగన్మాతకు భక్తుల నీరాజనం

నంద్యాల గాంధీచౌక్, పాతపట్టణం, కొత్తపల్లి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మొదటిరోజు పలు ఆలయాల్లో అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవి రూపంలో దర్శనమిచ్చారు. కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరంలో లలితాదేవి అమ్మవారికి బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణ చేశారు.

మహానంది, న్యూస్‌టుడే: మహానంది క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు, అర్చకులు ఈవో శ్రీనివాసరెడ్డి, విజయ దంపతులతో ప్రారంభోత్సవ పూజలు చేయించారు.



బేతంచెర్లలో కాత్యాయనిగా మహాలక్ష్మి



మహానందిలో శైలపుత్రి అలంకరణలో..



నంద్యాల గాంధీచౌక్: బ్రహ్మనందీశ్వర ఆలయంలో శైలపుత్రి అలంకరణలో..



నంద్యాల గాంధీచౌక్: లలితానగర్‌లో బాలా త్రిపురసుందరిగా అమ్మవారు



కొత్తపల్లి: సంగమేశ్వరంలో బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో లలితాదేవి

రైలు సర్వీసుల రద్దు.. జనానికి పాట్లు

☛ దృష్టి సారించని ప్రజాప్రతినిధులు

☛ నేడు ఎంపీలతో ద.మ.రైల్వే జీఎం సమావేశం

ఈనాడు, కర్నూలు: రాష్ట్రంలోని ప్రధాన నగరమైన కర్నూలుకు రాజధాని అమరావతి (విజయవాడ) నుంచి ఒక్క రైలు కూడా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం కర్నూలుకు కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకురాలేపోగా ఉన్న రైలు సర్వీసులు రద్దైనా పట్టించుకోలేదు. రైలు సర్వీసుల కోసం స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి రైల్వే ఉన్నతాధికారులపై ఎలాంటి ఒత్తిడి లేకపోవడంతో రద్దు చేసిన రైళ్లను ఎప్పటికి పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి. కర్నూలు నుంచి మచిలీపట్నం వరకు ఉన్న ప్రత్యేక రైలు సర్వీసును సుమారు ఏడాది కిందట రద్దు చేశారు. వారానికి మూడు రోజులపాటు తిరిగే ఈ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నా అధికారులు దానిని పునరుద్ధరించడం లేదు. మచిలీపట్నం నుంచి కర్నూలు వరకు వచ్చే ఈ రైలును మంత్రాలయం వరకు పొడిగించారు. ఆ సర్వీసును ప్రతిరోజూ నడపాలని ప్రయాణికులు డిమాండు చేశారు. దీనిని నెరవేర్చకపోగా సర్వీసును ఏకపక్షంగా రద్దు చేశారు.

శిర్డీకి సర్వీసులు అవసరం

రాష్ట్రంలోని పలు ప్రాంతాలవారు శిర్డీ వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. కర్నూలు నుంచి వారంలో శని, ఆదివారాల్లో మాత్రమే నాగర్‌సోల్ వరకు వెళ్లేందుకు రైలు ఉంది. గుంటూరు నుంచి కర్నూలు మీదుగా ఔరంగాబాద్ వరకు ప్రతిరోజూ ఒక రైలు సర్వీసు నడుస్తోంది. దీనిని విజయవాడ నుంచి ప్రారంభించి నాగర్‌సోల్ వరకు నడిపేలా చర్యలు తీసుకుంటే శిర్డీ వెళ్లే ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉంటుంది.

● కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఉపయుక్తంగా ఉన్న హంద్రీ రైలును డోన్ వరకు పొడిగించవచ్చు. ఫలితంగా డోన్‌వాసులు కూడా అతి తక్కువ ధరకే హైదరాబాద్ వెళ్లేందుకు మార్గం సుగమమవుతుంది.



కర్నూలుకు పిట్‌లైన్ అవసరం

రైళ్ల ప్రాథమిక నిర్వహణ, సామర్థ్య పరీక్షల కోసం పిట్‌లైన్ సదుపాయం అత్యంత కీలకం. కాచిగూడ దాటిన తర్వాత తిరుపతి వరకు 24 బోగీల రైలును నిలిపే పిట్‌లైన్ లేదు. ఇది ఉంటే పలు నూతన రైళ్లను ప్రారంభించుకునే వెసులుబాటు కలుగుతుంది. కర్నూలులో పిట్‌లైన్ ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ నేటికీ సాకారం కాలేదు.

రాజధానికి రైలు ఉండాల్సిందే

- బస్తిపాటి నాగరాజు, ఎంపీ, కర్నూలు



కర్నూలు నుంచి రాజధానికి వెళ్లేందుకు ఒక్క రైలు కూడా లేకపోవడం బాధాకరమైన విషయం. విజయవాడ వెళ్లేందుకు ఒక రైలు ఉండాల్సిందే. రైల్వే జీఎంతో నేను శుక్రవారం సమావేశమవుతున్నాం. కర్నూలుకు రైల్వేపరంగా జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తాను. కర్నూలు నుంచి మచిలీపట్నం రైలును పునరుద్ధరించాలని, విశాఖ వరకు మరో రైలు వేయాలని కోరుతా.

రిజర్వేషన్ సౌకర్యమేదీ..

డోన్-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలుకు ఒకప్పుడు ఒక ఏసీ, రెండు సెకండ్ సిట్టింగ్ బోగీలుండేవి. డోన్ నుంచి తగిన డిమాండు లేకపోవడంతో ఆయా బోగీలను, రిజర్వేషన్ సదుపాయాన్ని తొలగించారు. ప్రస్తుతం ఆ రైలుకు రిజర్వుడ్ బోగీలు లేకుండా సాధారణ బోగీలతో నడుపుతున్నారు. ఆ రైలును కర్నూలు నుంచి నడిపేందుకు అన్నిరకాల అవకాశాలు ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. డోన్-గుంటూరు రైలు రేకే గుంటూరు నుంచి నరసాపూర్ వరకు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ రెండు రైళ్లను విలీనం చేసి కర్నూలు నుంచి నరసాపూర్ వరకు ఒక సర్వీసు నిర్వహించుకోవచ్చు.

● కర్నూలు నుంచి ముంబయి వరకు రైలు నడపాలన్న ప్రతిపాదన ఉంది. తాజాగా మంత్రి టి.జి.భరత్ కూడా గత నెల 19వ తేదీన దిల్లీ వెళ్లి రైల్వేశాఖ మంత్రిని కలిశారు. కర్నూలు నుంచి విజయవాడకు ప్రతి రోజూ ఒక రైలు, కర్నూలు నుంచి ముంబయికి వారానికి కనీసం రెండు సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని వినతిపత్రం ఇచ్చారు.

డీపీవోగా జమీవుల్లా బాధ్యతల స్వీకరణ

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారిగా షేక్ జమీవుల్లా గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఇక్కడ డీపీవోగా పనిచేస్తున్న మంజులవాణిని జూపాడుబంగ్లా ఎంపీడీవోగా బదిలీ చేశారు. మంజులవాణి నుంచి బాధ్యతలు స్వీకరించిన జమీవుల్లాను డీపీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.



షేక్ జమీవుల్లా

సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామాకు ఎక్స్‌ప్రెస్ రైలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామాకు ప్రత్యేక రైలు (07039) డోన్ రైల్వేస్టేషన్ మీదుగా ఈ నెల 6న ప్రయాణిస్తుందని దక్షిణమధ్య రైల్వే శాఖ గురువారం తెలియజేసిందని రైల్వేస్టేషన్ మేనేజర్ జి. వెంకటేశ్వర్లు తెలిపారు. సికింద్రాబాద్‌లో ఉదయం 11.45 గంటలకు బయల్దేరి డోన్‌కు సాయంత్రం 4.50 గంటలకు చేరుకొని మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు వాస్కోడిగామాకు చేరుతుందన్నారు. ఇదే రైలు రెగ్యులర్ సర్వీసు ఈ నెల 9 నుంచి ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామాకు ఎక్స్‌ప్రెస్ రైలు (17039)నడుస్తుందని పేర్కొన్నారు. ఈ రెగ్యులర్ రైలు 9న ఉదయం 10.05 గంటలకు బయల్దేరి, సాయంత్రం 3.20 గంటలకు వస్తుందని, వాస్కోడిగామాకు మరుసటి రోజు ఉదయం 5.40గంటలకు చేరుకుంటుందన్నారు. వాస్కోడిగామా నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే ఎక్స్‌ప్రెస్ రైలు (17040) గురు, శనివారాల్లో నడుస్తుందని, వాస్కోడిగామా నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి డోన్‌కు రాత్రి 10.50 గంటలకు చేరుకుని, సికింద్రాబాద్‌కు మరుసటి రోజు ఉదయం 6.20 గంటలకు వెళ్తుందని తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది క్షేత్రంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఆలయ ఆవరణలోని చిన్న కోనేరుకు రూ.55 లక్షలతో మరమ్మతులు, రూ.24 లక్షలతో నిత్య అన్నదానం పునర్నిర్మాణం చేపట్టనున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హోమాల నిర్వహణ కోసం యాగశాలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, పండితులు ఎమ్మెల్యేని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు, తెదేపా నాయకులు బన్నూరి రామలింగారెడ్డి, బనిరెడ్డి నాగధానపాల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఉల్లి మధు తదితరులు పాల్గొన్నారు.



నిత్యాన్నదాన మండపానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, దాతలు

భర్త చేతిలో భార్య హత్య



శివపార్వతి (పాత చిత్రం)

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని కనకాద్రిపల్లెకు చెందిన శివ పార్వతి(35)భర్త చేతిలో గురువారం హత్యకు గురైనట్లు సీఐ రమేష్‌బాబు చెప్పారు. గ్రామానికి చెందిన మృతురాలు పార్వతికి, యాడికి మండలానికి చెందిన రామ్మోహన్‌కు 15 ఏళ్ల కిందట వివాహం కాగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, రామ్మోహన్ తాగుడుకు బానిసయ్యాడన్నారు. కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ఆయనకు, భార్యకు మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయారన్నారు. పార్వతిపై అనుమానంతో వేటకొడవలి, ఇనుపరాడ్డుతో తలపై విచక్షణారహితంగా మోది నరకడంతో ఆమె గురువారం అక్కడికక్కడే మృతి చెందగా, నిందితుడు పరారయ్యాడు. మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పంచనామా నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు పేర్కొన్నారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని పెసరవాయి బాట సమీపంలో జరిగిన రహదారి ప్రమాదంలో ఎల్ల అర్జున్ (34) మృతి చెందినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. చిందుకూరు గ్రామానికి చెందిన అర్జున్ బుధవారం తన భార్య రాధమ్మ, కుమారుడు, కుమార్తెను దామగట్ల గ్రామంలో వదిలారు. అదేరోజు రాత్రి ద్విచక్ర వాహనంపై చిందుకూరుకు వెళుతుండగా పెసరవాయి బాట దాటిన తర్వాత లారీ తగలడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శాంతిరాం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పలుకూరు (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ నాగభరత్(20) పలుకూరులో మృతిచెందారని పోలీసులు తెలిపారు. పలుకూరుకు చెందిన సీహెచ్ నాగరాజు కుమారుడు నాగభరత్ చదువు మానుకుని ఇంటిలో ఉండటంతో తండ్రి మందలించారు. దీంతో సెప్టెంబరు 29న పురుగు మందు తాగడంతో చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. నందివర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

మహానంది, న్యూస్‌టుడే: మండలంలోని సీతారామపురానికి చెందిన మహిళ దేవరశెట్టి సుబ్బలక్ష్మమ్మ ఫిర్యాదుతో వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్.రామమోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆమెకు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన రంగనాయకులుతో 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక బాబు. సాఫ్ట్‌వేర్ పని చేస్తున్న భర్తతో పాటు ఆయన తల్లిదండ్రులు, ఆడపిల్ల, అల్లుడు తనను వేధింపులకు గురిచేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నయనానందం.. నృత్యాభినయం

☛ జాతీయ స్థాయిలో బాలికల ప్రతిభ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బాలికలు తమ నృత్య ప్రదర్శనతో అబ్బురపరుస్తున్నారు. వివిధ రంగాల్లో తమ ముద్ర వేసుకుంటూ రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలతో ప్రత్యేకత చాటుకుంటున్నారు ఎమ్మిగనూరుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు. జాతీయ స్థాయిలో అవార్డులు పొందాలని నిరంతర నృత్య సాధన చేస్తున్నారు.

50 ప్రదర్శనలు.. 15 పురస్కారాలు



నేను ఎనిమిదో తరగతి చదువుతున్నా. మా అమ్మానాన్నల ప్రోత్సాహంతో ఐదేళ్లుగా కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నాను. జతులు, స్వరాలు, పద వర్ణాలు, పద స్వరాలలో మెలకువలు నేర్చుకున్నాను. అంతర్రాష్ట్ర కూచిపూడి పోటీ విభాగంలో ప్రదర్శన ఇచ్చా. 2021లో హైదరాబాద్‌లో నృత్య ప్రదర్శనలో పాల్గొని ప్రతిభా పురస్కారం అందుకున్నా. అదే ఏడాది తెలుగు బుక్ ఆఫ్ ఇండియావారు రాజమహేంద్రవరంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నా. 2022 మార్చిలో హంపీలో జరిగిన నృత్య ప్రదర్శనలో ప్రతిభా పురస్కారం అందుకున్నాను. ఇప్పటి వరకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో 50 ప్రదర్శనలు ఇచ్చాను. 15 వరకు ప్రతిభ పురస్కారాలు పొందాను. 2023లో రాష్ట్ర స్థాయి ప్రదర్శనల్లో తిరుపతి, హైదరాబాద్, శ్రీశైలం, రాయచూర్, బెంగళూరు, నెల్లూరు, మహానంది, బళ్లారి, హంపి, గుంటూరు తదితర చోట్ల ప్రదర్శనలు ఇచ్చాను. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నాట్యానికి సంబంధించిన కళాశాల బృందాలు నిర్వహించిన నాట్య తిలక్, నాట్యరాణి, నాట్యసుధ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సాధించాను.

తృతీయ స్థానంలో నిలిచి..



నేను ఎమ్మిగనూరు పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. మా అమ్మానాన్నల ప్రోత్సాహంతో భరత నాట్యం నేర్చుకుంటున్నా. ఐదేళ్లుగా నృత్య ప్రదర్శనలు ఇస్తున్నా. సుబ్బారెడ్డి ఫౌండేషన్ ద్వారా పాల్గొంటున్నా. ఇప్పటి వరకు వంద ప్రదర్శనలు ఇచ్చాను. బస్వాపుర నృత్యంతో గుర్తింపు వచ్చింది. మూడేళ్లుగా నెల్లూరు, బెంగళూరు, తిరుపతి, మహానంది, బళ్లారి, తిరుపతి, మంత్రాలయం, శ్రీశైలం, నంద్యాల, హైదరాబాద్, రాయచూరు, హంపీలో జరిగిన నృత్య ప్రదర్శనల్లో పాల్గొని పురస్కారాలు అందుకున్నా. 2022లో తెలంగాణ, ఏపీ రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాను. 8 రాష్ట్రాల్లో జరిగిన జాతీయ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాను. ప్రస్తుతం మళ్లీ జాతీయ పోటీల్లో ప్రదర్శనకు ప్రతిరోజూ సాధన చేస్తున్నా.

నంద్యాల

సర్వేపల్లి విగ్రహం ఏర్పాటు చేయండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రం నంద్యాలలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పీఆర్టీయూ నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను గురువారం వారు ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామపక్కీర్‌రెడ్డి, కేవీ భాస్కర్‌రెడ్డి, నాయకులు కృష్ణారావు, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో బస్సు పాస్ కౌంటరు మూసివేత

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల ఆర్టీసీ బస్టాండులో బస్సు పాస్ కౌంటరును ఈనెల 5, 6 తేదీల్లో మూసివేస్తున్నట్లు డీఎం గంగాధరరావు గురువారం తెలిపారు. విద్యార్థుల బసు పాస్‌లు, సీజనల్ టికెట్ల సాఫ్ట్‌వేర్‌ను ఆధునికీకరిస్తున్న కారణంగా కౌంటరును మూసివేస్తున్నట్లు వెల్లడించారు. 7వ తేదీ నుంచి యాథాతథంగా కౌంటరు పనిచేస్తుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నందికొట్కూరు గ్రామీణం : సమస్య : నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామంలో ప్రధాన రహదారిపై నీరు నిలుస్తుండటంతో ఇబ్బందిగా ఉంది. **- కిశోర్, స్థానికుడు**

సమాధానం : రహదారిపై నీరు నిలవకుండా చర్యలు చేపడతాం. **- నవీన్, సర్పంచి**

సమస్య : శాతనకోటలో ట్యాంకులు నిండి రహదారిపై నీరు వృథాగా పారుతోంది. **- ఆనంద్, స్థానికుడు**

సమాధానం : నీరు వృథా కాకుండా చూస్తాం. **- జనార్దన్, సర్పంచి**

కొత్తపల్లి : సమస్య : గువ్వలకుంట్లలో వృథానీరు రహదారిపై పారుతోంది. **- రవి, స్థానికుడు**

సమాధానం : రోడ్డుపై నీరు పారకుండా చర్యలు తీసుకుంటాం. **- చాందిని, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : శివపురం సమీపంలో ప్రధాన రహదారి పక్కనే చెత్త వేసి నిప్పు పెడుతున్నారు. **- రాజేశ్, ప్రయాణికుడు**

సమాధానం : గ్రామంలో సేకరించిన చెత్తను సంపద కేంద్రానికి తరలించేందుకు చర్యలు చేపడతాం. **- అజ్మతున్నిసా, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : సింగరాజుపల్లిలో వర్షానికి మట్టిదారులు అధ్వానంగా మారుతున్నాయి. **- అరుణ్, స్థానికుడు**

సమాధానం : గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తాం. **- విజయ్‌కుమార్, సర్పంచి**

ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచండి

యాళ్లూరు (గోస్పాడు), న్యూస్‌టుడే : ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని డీసీహెచ్‌ఎస్ డా.జఫ్రుల్లా సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని యాళ్లూరులో సీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. గదులు, రికార్డులను పరిశీలించారు. గదుల కొరతపై ఆరా తీశారు.



సిబ్బందికి ఆదేశాలిస్తున్న జిల్లా మానిటరింగ్ అధికారి డా.జఫ్రుల్లా

చెత్త పన్నుకు చెల్లుచీటీ

◆ రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం ◆ పుర ప్రజలకు తప్పిన భారం



నంద్యాల పురపాలక కార్యాలయం

నంద్యాల పురపాలకం, రైతునగరం, న్యూస్‌టుడే : ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం వివిధ పన్నుల భారంతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత సర్కారు నిర్ణయాలను సమీక్షిస్తూ ఒక్కొక్కటిగా భారాన్ని తొలిగిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జగన్ సర్కారు పట్టణ వాసుల నుంచి చెత్త పన్ను వసూలు చేసింది. పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించినా పట్టించుకోలేదు. తాము అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని చెత్త పన్ను వసూలును రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం ప్రకటించారు. దీంతో జిల్లా ప్రజలపై కోట్ల రూపాయల భారం తగ్గనుంది.

ఉద్యోగులకు లక్ష్యాలు

స్థానిక సంస్థల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు గత ప్రభుత్వం 2022 ఫిబ్రవరిలో క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) పథకాన్ని తీసుకొచ్చింది. అప్పటి నుంచి ఇంటింటి చెత్త సేకరణపై పన్ను వసూలు చేశారు. చెత్త పన్ను రద్దు చేయాలని ప్రజలు, ప్రజా సంఘాలు రోడ్డెక్కి పోరాటాలు చేసినా వెనక్కి తగ్గలేదు. పైగా ఉద్యోగులకు లక్ష్యాలు ఇచ్చి మరీ వసూలు చేయించింది. చెత్త సేకరణకు వెయ్యిళ్లకు ఒక వాహనాన్ని కేటాయించింది. వాటికి చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రజల నుంచి రూ.30 నుంచి రూ.2000 వరకు యూజర్ ఛార్జీల రూపంలో వసూలు చేసి సర్దుబాటు చేసేవారు. ఆయా మున్సిపాల్టీ స్థాయిని బట్టి ఒక్కో క్లాప్ ఆటోకు నెలకు రూ.50 వేల నుంచి రూ.60 వేల మధ్య స్థానిక సంస్థలే చెల్లించేలా గుత్తేదారులు సమకూర్చారు. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించాల్సిన స్థానిక సంస్థల నిధుల్లో పది శాతానికిపైగా వీటికి వినియోగించే వారు. అయినా సరే పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడలేదు.

పురపాలక సంఘం	: నంద్యాల
గృహాలు	: 63 వేలు
దుకాణాలు	: 10 వేలు
ఏటా వసూలైన చెత్త పన్ను	: రూ.1.68 కోట్లు
2022 ఫిబ్రవరి- 2024 మార్చి వరకు లక్ష్యం	: రూ.5.33 కోట్లు
వసూలైన మొత్తం	: రూ.3 కోట్లు



మూలకుచేరిన క్లాప్ వాహనాలు

బెదిరించి మరీ వసూలు

ఇంటింటి చెత్త సేకరణ కోసం గత వైకాపా ప్రభుత్వం క్లాప్ వాహనాలను ఏర్పాటు చేసింది. ఆ వాహనాల నిర్వహణకు అయ్యే ఖర్చును స్థానిక సంస్థలే భరించాలని నిర్ణయించారు. ఇది స్థానిక సంస్థలకు తలకు మించిన భారంగా మారింది. ఈ భారాన్ని ప్రజలపై వేశారు. సచివాలయ కార్యదర్శులపై ఒత్తిడి పెంచడంతో వారు చెత్త పన్నును ప్రజల ముక్కుపిండి వసూలు చేసేవారు. ఎవరైనా చెల్లించకపోతే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని భయపెట్టేవారు. దీంతో చేసేదేమిలేక ఇబ్బందిపడుతూనే పన్ను చెల్లించాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్త పన్ను వసూలు చేయనప్పటికీ అధికారికంగా మాత్రం రద్దు చేయలేదు. తాజాగా దీన్ని రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి అధికారిక ప్రకటన చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహం అడ్డగింత

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని అయ్యలూరు గ్రామంలో జరుగుతున్న ఓ బాల్య వివాహాన్ని గ్రామీణ పోలీసులు, ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులు గురువారం ఆపివేశారు. గ్రామంలో ఓ బాలికకు వివాహం చేస్తున్నారన్న సమాచారంతో గ్రామీణ పోలీసులు ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులతో కలిసి బాలిక ఇంటికి వెళ్లారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు వివరించి వివాహాన్ని నిలుపుదల చేయించారు.

నియంత్రిక పరిసరాలు శుభ్రం

స్పందనకు వందనం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని బర్మశాల రహదారి పక్కనే తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో ఇది వాహనదారులకు కనిపించక ప్రమాదాలు పొంచి ఉండేవి. ఈ పరిస్థితిపై 'ఈనాడు'లో ఈనెల 2న 'పొదల మాటున ప్రమాదం' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు శాఖ అధికారులు నియంత్రిక చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, అల్లుకున్న తీగలను తొలగించారు. నియంత్రిక ఎత్తులో ఏర్పాటు చేసి రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

భూసార పరీక్షల ఆధారంగా
ఎరువులు వాడాలి



భూసార పరీక్షల పత్రాలు అందజేస్తున్న సర్పంచి ఓబులేసు, వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులు వాడాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజశేఖర్ సూచించారు. నంద్యాల మండలంలోని అయ్యలూరు, పెద్దకొట్టాల గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు భూసార పరీక్షల ఫలితాల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అయ్యలూరు సర్పంచి ఓబులేసు, పెద్దకొట్టాల సర్పంచి వెంకటరమణ, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏఈవో ముక్తార్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

గడివేముల, న్యూస్‌టుడే : భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ఎల్‌కేతండా గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

విద్యా సంస్థలపై చర్యలకు డిమాండ్

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం పీడీఎస్‌యూ నంద్యాల డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించినా కొన్ని విద్యా సంస్థల్లో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తనిఖీ చేసి వాటి గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు షాహిద్, హరి, బాలాజీ, చందు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ

విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి సోమన్న, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ పిలుపునిచ్చారు. నంద్యాల బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట వామపక్ష, రైతు సంఘాల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం మూడోరోజూ కొనసాగింది. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయమని చెప్పిన పార్టీలు అధికారంలోకి వచ్చాక మాట తప్పాయని విమర్శించారు. పరిశ్రమను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని కోరారు. లేదంటే కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. దీక్షలో సురేష్, నరసింహ, నాయక్, వెంకటేశ్వర్లు, బాలనరసింహుడు తదితరులు పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో వామపక్ష, రైతు సంఘాల నాయకులు



నంద్యాల గాంధీచౌక్ : సంజీవనగర్ కోదండ రామాలయంలో



నంద్యాల బొమ్మలసత్రం : గిరినాథ్ సెంటర్‌లో



నంద్యాల బొమ్మలసత్రం : నూనెపల్లెలో



నంద్యాల బొమ్మలసత్రం : మారుతీ నగర్‌లో అమ్మవారి దివ్యరూపం



నంద్యాల బొమ్మలసత్రం : ఏకలవ్య నగర్‌లో బాలా త్రిపురసుందరీదేవి




బండిఆత్మకూరు : ఓంకారంలో

త్రిపుర సుందరి.. లోక శుభంకరి

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ఊరూరా ఘనంగా ప్రారంభమయ్యాయి. నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. మొదటిరోజు శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబాదేవి, మహానందిలో కామేశ్వరీదేవి అమ్మవార్లు శైలపుత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో బాలా త్రిపురసుందరీదేవి, దుర్గాదేవి, రాజరాజేశ్వరి అలంకరణలు చేశారు. విద్యుద్దీపాలు, పుష్పాలతో నయనానందకరంగా అలంకరించిన వేదికపై సుందర రూపంలో కొలువుదీరిన అమ్మవార్లను పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం



మహానంది : పూజలందుకున్న అమ్మవారు



బండిఆత్మకూరు : కాకనూరులో దుర్గాదేవిగా శారదాదేవి



పాణ్యం గ్రామీణం : కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో



కొత్తపల్లి : కొలనుభారతిలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణ



ఆత్మకూరు : బాలా త్రిపుర సుందరి అలంకరణలో మల్లెలమ్మ



నందికొట్కూరు : బాలా త్రిపుర సుందరి అలంకరణలో



నందికొట్కూరు : వాసవీ కన్యకాపరమేశ్వరి

ఆటపై పట్టు.. విజయాలకు మెట్టు

◆ రాష్ట్రస్థాయి పోటీలకు ఆత్మకూరు విద్యార్థుల ఎంపిక

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : క్రీడలపై ఆసక్తితో కొందరు విద్యార్థులు తమకు ఇష్టమైన ఆట నేర్చుకుంటున్నారు. పట్టుదలతో సాధన చేసి పాఠశాల స్థాయిలోనే పోటీల్లో రాణిస్తూ విజయ పథంలో సాగుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచి పతకాలు అందుకుని ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఇదే కోవలో ఆత్మకూరుకు చెందిన అబ్దుల్ రహిమాన్, అబ్దుల్ ఖాదర్ తైక్వాండో, హ్యాండ్‌బాల్‌లో సత్తా చాటుతూ ప్రశంసలు అందుకుంటున్నారు.

రహిమాన్.. తైక్వాండోలో తడాఖా



ఆత్మకూరు పట్టణం కొత్తపేటకు చెందిన ఫాతిమాబీ, షేక్ అబ్దుల్లా దంపతుల కుమారుడు అబ్దుల్ రహిమాన్. కరివేన గ్రామంలోని డీపాల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి తైక్వాండో క్రీడలో ఉత్తమ ప్రతిభ చూపుతున్నాడు. ఆత్మకూరులోని కేవీకే స్టేడియం ఆవరణలో శిక్షకులు ఖాజాహుసేన్, సామన్న సమక్షంలో ప్రతిరోజూ సాధన చేస్తున్నాడు. ఆటపై పట్టు సాధించిన పోటీల్లో రాణిస్తున్నాడు.

- ఈ ఏడాది జూన్ 30న కర్నూలులో జరిగిన ఉమ్మడి జిల్లా తైక్వాండో పోటీల్లో రజత పతకం అందుకున్నాడు.
- ఆగస్టులో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం సాధించాడు.
- సెప్టెంబరు 30న నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.
- ఈనెల 7న తిరుపతిలో జరుగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఆడనున్నాడు.

ఖాదర్.. హ్యాండ్‌బాల్‌లో దూకుడు



ఆత్మకూరు పట్టణం కొత్తపేటకు చెందిన ఖాజాషర్ఫుద్దీన్, దౌలత్‌బీ దంపతుల కుమారుడు అబ్దుల్ ఖాదర్. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి హ్యాండ్‌బాల్ క్రీడలో సత్తా చాటుతున్నాడు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు దేవానంద్ పర్యవేక్షణలో సాధన చేసి ఆటలో మెలకువలు నేర్చుకున్నాడు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పోటీల్లో రాణిస్తున్నాడు.

- గతనెల 30న నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు.
- ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నాడు.

బాలింత మృతితో బంధువుల ఆందోళన

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లోని ఎంఎస్ఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింత అస్మాబీ (28) గురువారం మృతి చెందారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆమె మృతి చెందారంటూ బంధువులు ఆసుపత్రి ఎదుట రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. మృతురాలి తల్లి హుసేన్‌బీ తెలిపిన వివరాల మేరకు.. జగజ్జననీనగర్‌కు చెందిన అస్మాబీకి 20 రోజుల కిందట ప్రసవం కోసం సర్వజన ఆసుపత్రిలో చేరారు. మగబిడ్డకు జన్మనిచ్చారు. ఆమెకు తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ కావడంతో వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలు జీజీహెచ్ నుంచి నంద్యాలలో తమకు తెలిసిన వైద్యురాలు సలీమున్నీసాకు చెందిన ఆసుపత్రికి వచ్చారు. ఆమె అక్కడి నుంచి పద్మావతినగర్‌లోని ఎంఎస్ఆర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడికి వెళ్లిన తర్వాత వైద్యులు కొన్ని శస్త్రచికిత్సలు, డయాలసిస్ చేశారు. 14 రోజులు చికిత్స పొందిన ఆమె గురువారం సాయంత్రం మృతి చెందారు. అప్పటికే బాధితులకు ఆసుపత్రి ఛార్జీలు రూ.55 వేలు, మందులకు రూ.2.5 లక్షలు ఖర్చయ్యాయి. ఇంకా రూ.2.7 లక్షల బిల్లులు చెల్లించాల్సి ఉందని, రూ.2 లక్షలు చెల్లించి మృతదేహం తీసుకెళ్లాలని ఆసుపత్రి మేనేజరు చెప్పారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే అస్మాబీ మృతి చెందిందంటూ బంధువులు ఆందోళనకు దిగారు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వైద్యులు, బాధితులతో మాట్లాడారు. దీంతో బాధితులు మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైంది. రోగికి చేయాల్సిన శస్త్రచికిత్సలు, వైద్యం చేసినప్పటికీ ఆమె కోలుకోలేక మృతి చెందారని వైద్యుడు డా.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు. ఎక్కువ ఫీజులు వసూలు చేయలేదన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం



విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ ఆదుకుంటోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పేర్కొన్నారు. పట్టణంలోని ఆత్మ భవనంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం రాయితీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నందికొట్కూరు, ఆత్మకూరు ఏడీఏలు విజయశేఖర్, ఆంజనేయులు, ఏవోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేసీలో పూడికతీత పనుల ప్రారంభం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని పొన్నాపురం కాలనీ పరిధిలో ఉన్న కేసీ కాల్వలో పూడికతీత పనులను తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ గురువారం ప్రారంభించారు.



పనులను పరిశీలిస్తున్న ఫిరోజ్

మిట్నాలకు చెందిన రవి చౌదరి సౌజన్యంతో ఈ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ ప్రజలు చెత్తాచెదారాన్ని కాల్వలో వేయకుండా చూడాలన్నారు. నాయకులు షేక్ మున్నా, జగదీశ్, జనార్దన్, నాగమద్దిలేటి, జనార్దన్‌గౌడ్, భాస్కర్, ఖాజాశంకర్ పాల్గొన్నారు.

అమ్మవారికి ఫిరోజ్ పూజలు : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పొన్నాపురంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహానికి తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం వార్డు సచివాలయాన్ని సందర్శించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పగిడ్యాల, న్యూస్‌టుడే: గ్రామస్థులకు చట్టాలపై కనీస అవగాహన అవసరమని నందికొట్కూరు గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని ముచ్చుమర్రిలో గురువారం నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళల హక్కులు, చట్టాలు, గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, లైంగిక వేధింపులు, సైబర్ నేరాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శరత్‌కుమార్ రెడ్డి, జూపాడుబంగ్లా ఎస్సై లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

వ్యవసాయ పరికరాలు సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు, న్యూస్‌టుడే : వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో పవన్‌కుమార్ సూచించారు. వెలుగోడులో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులు వాడాలన్నారు.

దొంగల అరెస్టు..
ద్విచక్రవాహనాల స్వాధీనం

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్టు చేసి, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు రెండో పట్టణ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన యువకులు రాత్రిళ్లు ద్విచక్ర వాహనాలను అపహరించి విక్రయించి జల్సా చేసేవారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్‌బీఐ కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఎస్‌బీఐకాలనీకి చెందిన గొంగటి అభిషేక్, అరుంధతినగర్ వాసి అనుపూరి శివదుర్గా, మహానంది మండలం తమ్మడపల్లెకు చెందిన మహేంద్రలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. దీంతో వారిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.4 లక్షల విలువైన ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో వైఎస్సార్‌నగర్‌కు చెందిన షిండే చంద్ర పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

పల్లె కబుర్లు

కొత్తపల్లి, న్యూస్‌టుడే : మొక్కజొన్న పంట కోత దశలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి హేమలత, మండల వ్యవసాయాధికారి మహేశ్‌లు రైతులకు సూచించారు. ఎదురుపాడులో మొక్కజొన్న పంట కోతలపై గురువారం శిక్షణ నిర్వహించారు.

పగిడ్యాల, న్యూస్‌టుడే : పగిడ్యాల నూతన ఎంపీడీవోగా పి.సుమిత్రమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లా ఖాజీపేటలో పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు.

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ సువర్ణమ్మ అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు.

గడివేముల, న్యూస్‌టుడే : గడివేముల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా అంకన్న, బిలకలగూడూరు పంచాయతీ కార్యదర్శిగా లక్ష్మన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. కొర్రపోలూరుకు హర్షవర్ధన్‌రెడ్డి, దుర్వేశిలో రాజశేఖర్‌రెడ్డి, బూజునూరు పంచాయతీ కార్యదర్శిగా షబానా విధుల్లో చేరారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : వెలుగోడు మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని మండల భాజపా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు ఎంఈవో బ్రహ్మంనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సెప్టెంబరు 30న పాఠశాల నుంచి 16 బియ్యం బస్తాలు బయటికి తరలించారని ఫిర్యాదు చేశారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

అందుబాటులో నూతన మద్యం విధానం

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని ప్రవేశపెట్టిందని నంద్యాల అబ్కారీశాఖ సూపరింటెండెంట్ రాముడు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అబ్కారీ శాఖ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి మాట్లాడారు.



బ్యానర్ వద్ద రాముడు, పోలీసులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నూతన మద్యం విధానాన్ని ఎంతో సులభతరం చేసిందని నంద్యాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంటు వి.రాముడు తెలిపారు. కోవెలకుంట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను గురువారం తనిఖీ చేసి ఆయన మాట్లాడారు.

బస్‌పాస్ కౌంటర్ రెండు రోజులు తెరవరు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రయాణికులకు, విద్యార్థులకు మెరుగైన సేవలందించేందుకు సర్వర్, సాఫ్ట్‌వేర్‌లను ఆధునికీకరిస్తున్నందున ఈ నెల 5, 6 (శని, ఆది) తేదీల్లో ఆర్టీసీ కొత్తబస్టాండు వద్ద బస్‌పాస్ కౌంటర్ పని చేయదని డిపో మేనేజర్ ఎం. శశిభూషణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 7న సోమవారం నుంచి యథావిధిగా బస్‌పాస్ కౌంటర్ పని చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రయాణికులు సహకరించాలన్నారు.

అచ్చెన్నను కలసిన ధర్మవరం

డోన్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడ్ని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లాలోని మంత్రి కార్యాలయంలో కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



సస్యరక్షణ చర్యలతో దిగుబడులు

పెద్దవంగలి(చాగలమర్రి), న్యూస్‌టుడే: రైతులు ఎప్పటికప్పుడు పంట సస్యరక్షణా చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. గురువారం మండలంలోని పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నమల్కాపురం(డోన్), న్యూస్‌టుడే: రబీలో శనగ సాగుచేసే రైతులకు విత్తనాలను 25 శాతం రాయితీపై అందిస్తామని వ్యవసాయాధికారి అబ్దుల్‌షఫి అన్నారు. గురువారం చిన్నమల్కాపురంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు

ఆళ్లగడ్డ గ్రామీణం,న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలానికి రబీ సీజన్‌కు జేజీ రకం శనగ విత్తనాలు మంజూరైనట్లు ఏవో కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 25 శాతం రాయితీతో విత్తనాలు ఇస్తారన్నారు. క్వింటా రూ.7050 చొప్పున రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కలుగొట్ల(కోవెలకుంట్ల గ్రామీణం)న్యూస్‌టుడే: కలుగొట్ల, జొలదరాసి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి నిరంజన్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారిణి ధరణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పశువైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: గొర్విమానుపల్లెకు చెందిన తెదేపా నాయకుడు పి.తిమ్మారెడ్డి అనారోగ్యంతో గురువారం మృతి చెందగా, బనగానపల్లి తెదేపా నాయకుడు బీసీ రాజారెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అయిదేళ్ల నిర్లక్ష్యం... తాగునీటికి శాపం



ఆగిన నీటితొట్టి నిర్మాణం పనులు

ఆళ్లగడ్డ తాగునీటి వివరాలు

పట్టణం: 50,000	వార్డులు: 27
గృహాలు: 14,100	కుళాయిలు: 9200
వినియోగిస్తున్న నీరు: 20లక్షల లీటర్లు	
అందాల్సిన నీరు: 33లక్షల లీటర్లు	

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పురపాలిక పరిధిలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఏఐఐబీ(ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) ద్వారా రూ.111.48 కోట్లను కేటాయించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) కూడా సిద్ధం చేశారు. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం అనుమతులు సాధించింది. ఆళ్లగడ్డ పట్టణానికి 20కి.మీ దూరంలో తెలుగు గంగ ప్రాజెక్టుపై నిర్మించిన గండ్లేరు జలాశయం నుంచి నీటిని గొట్టాల ద్వారా తరలించి పుర ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉంది. 2019లో తెదేపా ప్రభుత్వం మారిపోయి వైకాపా అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రాజెక్టు పరిధిలో కీలకమైన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు అప్పటి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. గత ఐదేళ్లలో వాటర్ ట్రీట్‌మెంట్ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మరోవైపు నీటితొట్ల నిర్మాణం మాత్రం నత్తనడకన సాగుతూ ప్రస్తుతం అసంపూర్తిగా మిగిలిపోయింది. నీటి గొట్టాల ఏర్పాటు పనులు కూడా ముందుకు సాగడం లేదు. వాటికి సంబంధించిన బిల్లులు సక్రమంగా రాకపోవడంతో గుత్తేదారు చేతులెత్తేసి పనులు మధ్యలోనే ఆపేశారు. ఏదిఏమైనా పనులు ముందుకు సాగడం లేదు. ఈ పథకం పూర్తి కాకపోవడంతో పాత బస్టాండులో ఉన్న రెండు పాత నీటి ట్యాంకుల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు. అవి కూడా శిథిలావస్థకు చేరినా మరమ్మతులు లేక అక్కడి నుంచే నీటిని పంపిణీ చేసి వినియోగిస్తున్నారు. పుర ప్రజల దాహార్తి తీర్చేందుకు 33లక్షల లీటర్ల నీరు అవసరం కాగా, కేవలం 18 నుంచి 20 లక్షల లీటర్ల నీరు మాత్రమే అందుబాటులోకి వస్తోంది. ప్రస్తుతం కేవలం ఏఐఐబీ పనులు కేవలం 10శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఈ పనులను మంచినీటి పంపింగ్, నీటి గొట్టాలు ఏర్పాటుగా రెండు విభాగాలుగా విభజించారు. అయితే రెండూ పూర్తికాకపోవడంతో ఇవి ఎప్పటికి పూర్తవుతాయోనన్న ఆందోళనలో ఆళ్లగడ్డ ప్రజలు ఉన్నారు.



వృథాగా పడిన నీటి గొట్టాల పరికరాలు

ఉన్నతాధికారులకు నివేదించాం

–తేజరెడ్డి, ఇన్‌ఛార్జి ఏఈ, పురపాలక శాఖ, ఆళ్లగడ్డ

నీటి పథకం ఆగిపోయిన విషయాన్ని పబ్లిక్ హెల్త్ విభాగం దృష్టికి తీసుకెళ్లాం. వారు పనులు ప్రారంభమయ్యేలా చేస్తామని తెలిపారు. త్వరలో పనులు పునః ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

టెన్నిస్, బ్యాడ్మింటన్‌లో ఉచిత శిక్షణ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దసరా సెలవులు ఇచ్చినందున టెన్నిస్, బ్యాడ్మింటన్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పూర్తి వివరాలకు 9490494749 (టెన్నిస్)కు, 8985702633 (బ్యాడ్మింటన్)కు సంప్రదించాలని ఆయన సూచించారు.

మేమున్నాం... మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 57496 డోన్ పట్టణం: 94408 57790 బనగానపల్లి: 80085 73763

ప్యాపిలి: సమస్య: బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు చీకట్లు ఉంటున్నాయి. **-మహేష్.**
సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **-లక్ష్మీదేవి, సర్పంచి.**

శిరివెళ్ల: సమస్య: గోవిందపల్లె బస్టాప్ వద్ద మురుగు నిల్వ ఉంది. **-నారాయణ.**
సమాధానం: చర్యలు తీసుకుంటాం. **-లక్ష్మీ మనోహర్, పంచాయతీ కార్యదర్శి.**

బేతంచెర్ల: సమస్య: కొలుములపల్లెలో కాలువలపై చిన్నపాటి కల్వర్టులు లేకపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. **-నారాయణ.**
సమాధానం: చర్యలు తీసుకుంటాం. **-వెంకట రంగ నాయక్, ఈవోఆర్‌డీ**

సమస్య: కొత్తబస్టాండులో తాగునీటి కుళాయి వద్ద కాలువలో చెత్తాచెదారం తొలగించకపోవడంతో మురుగు పారడం లేదు. **-చాంద్‌బీబీ.**
సమస్య: పొట్టిరెడ్డి కల్యాణ శాల సమీపంలో తాగునీటి వాల్వ్ పరిసరాలు పాడయ్యాయి. -రమేష్‌రెడ్డి, బేతంచెర్ల
సమాధానం: శుభ్రం చేయిస్తాం.
-సుజాత, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

బనగానపల్లి గ్రామీణం: సమస్య: నందివర్గంకొత్తూరుకు వెళ్లే దారిలో దీపాలు వెలగడం లేదు. **-రవికుమార్.**
సమాధానం: చర్యలు తీసుకుంటాం.
-వెంకటరమణ, ఎంపీడీవో, బనగానపల్లి.

నడకతోనే ఆరోగ్యం

పలుకూరు (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నడకతోనే ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుందని జేకేఆర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బ్రహ్మానందచారి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పలుకూరులో ఆయన ఆధ్వర్యంలో నడక ప్రాధాన్యాన్ని వివరిస్తూ గ్రామంలో కరపత్రాలు పంపిణి చేశారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

చెంచుగూడెం(చాగలమర్రి), న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని డి.వనిపెంట సెక్షన్ అటవీ అధికారి రామకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని డి. వనిపెంట చెంచుగూడెంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వన్యప్రాణుల సంరక్షణా వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు

వాలిన నిర్లక్ష్యం



కోవెలకుంట్ల నుంచి నంద్యాలకు వెళ్లే ప్రధాన రహదారిలో కలుగొట్ల గ్రామ సమీపంలో గని గుంతల దగ్గర విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఒంగింది. గనిగుంతల వైపు వాలి కూలేందుకు సిద్ధంగా ఉంది. స్తంభం కూలకముందే అధికారులు స్పందించి దీన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కోవెలకుంట్ల**

నిరుపయోగంగా ప్లాంటు

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు శుద్ధజలం అందించడానికి ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసింది.. ఉయ్యాలవాడ, ఇంజేడు, తుడుమలదిన్నె, మాయలూరు, అల్లూరు, ఆర్.పాంపల్లె, నర్సిపల్లె సర్వాయిపల్లె గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలాచోట్ల పని చేయడం లేదు. గురువారం ఆళ్లగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి తేజేశ్వరి, మండల పర్యవేక్షకురాలు దీప్తి దృష్టికి తీసుకెళ్లగా... విద్యుత్తు వసతి లేక పోవటంతో బాగు చేయడానికి అవకాశం లేదన్నారు. **–న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ**



తెచ్చారు..నాటడం మరిచారు



పురపాలక కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటకుండా వృథాగా వదిలేశారు. వాటికి నీరు అందక, రక్షణ కరవై ఎండలకు ఎండిపోతున్నాయి. మొక్కలను నాటి సంరక్షించాలని చెప్పే పుర అధికారులే వాటిని నాటకుండా వదిలేయడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. **-న్యూస్‌టుడే, డోన్ పట్టణం**

తీగలు అమర్చరూ!

సౌదరదిన్నెలో విద్యుత్తు స్తంభాలకు తీగలు అమర్చక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు ఎదురు వీధిలో దాదాపుగా మూడు నెలల కిందట విద్యుత్తు స్తంభాలు నాటి, తీగలు అమర్చలేదు. అధికారులు స్పందించి తీగలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, సౌదరదిన్నె(కోవెలకుంట్ల గ్రామీణం)



రాకపోకలకు ఇబ్బంది



తువ్వపల్లెలోని ప్రధాన రహదారిపై మురుగు, ఇండ్లలోని నీరు వచ్చి చేరి బురదగా మారింది. ఈ సీసీ రహదారిపై ఆదర్శ పాఠశాల విద్యార్థులు సైకిల్‌పైనా, ఉపాధ్యాయులు ద్విచక్రవాహనాలపైనా ఇబ్బందికరంగా రాకపోకలు సాగిస్తుంటారని, బురదగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై నుంచి కిందపడి గాయాలపాలవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రహదారిపై బురదను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, తువ్వపల్లె(రుద్రవరం)

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మనీషా, ప్రజిత, కిరణ్ జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు కోటయ్య తెలిపారు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు రాజయ్య గురువారం తెలిపారు. కబడ్డీలో మహేష్, జీవన్‌కుమార్, నరేష్, యోగాలో సుంకిరెడ్డి, విశాల్, బ్యాడ్మింటన్‌లో హుస్సేన్‌వలి, వాలీబాల్‌లో బార్ అబ్దుల్ ఎంపికయ్యారన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

అవుకు, న్యూస్‌టుడే: అవుకు తహసీల్దారుగా వైఎస్సార్ జిల్లాకు చెందిన సువర్ణాదేవిని నియమించారు.

డోన్, న్యూస్‌టుడే: డోన్ ఎంపీడీవోగా వెంకటేశ్వర రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

డోన్, న్యూస్‌టుడే: డోన్ అభివృద్ధికి ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సతీష్ కృషి చేశారని ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన అధికారులను గురువారం సన్మానించారు.

డోన్, న్యూస్‌టుడే: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ప్రజా సమస్యలపై శుక్రవారం ఫిర్యాదుల్ని స్వీకరిస్తారని తెదేపా నాయకులు తెలిపారు. తెదేపా కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారన్నారు.

బనగానపల్లి: పెట్రోలు బంకు కూడలిలో గురువారం ఆవును ప్రైవేట్ లారీ ఢీకొనడంతో భాజపా జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చు శరత్ చంద్రకుమార్ ఆటోలో పశువైద్యశాలకు తరలించారు. చికిత్స అనంతరం యాగంటి ఆలయం సమీపంలోని గోశాలకు తరలించారు.

డోన్, న్యూస్‌టుడే: డోన్ డివిజన్ పంచాయతీరాజ్ డీఈగా గంగాధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు.

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: చౌడేశ్వరి ఆలయంలో ఆలయాధికారిణి కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: డి.వనిపెంట సెక్షన్ అటవీ శాఖ అధికారిగా రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధులపై అవగాహన ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం అవగాహన కల్పించారు. రుద్రవరం రేంజ్ నూతల సెక్షన్‌లో ఎఫ్‌బీవోగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ పదోన్నతి పొంది ఎఫ్ఎస్‌వోగా డి.వనిపెంట సెక్షన్‌కు బదిలీపై వచ్చారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో ఫజుల్ రహిమాన్ పేర్కొన్నారు. ప్యాపిలి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన బేతంచెర్ల ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి మండల నూతన ఎంపీడీవోగా బి.వెంకటరమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

డోన్, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కర్నూలు రహదారిలో ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేయించారు.

జననీ..శుభకారిణి

జననీ శుభకారిణి అంటూ భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం వాడవాడలా ఉత్సవాలు మొదలయ్యాయి. అమ్మవార్లను అందంగా అలంకరించి పూజలు చేశారు. –న్యూస్‌టుడే బృందం.



డోన్: ప్రత్యేక అలంకరణ



ఆళ్లగడ్డలో గంగాజలాన్ని తీసుకుని వస్తున్న ఆర్యవైశ్యులు



బేతంచెర్ల: చౌడేశ్వరీ దేవి కోవెలలో పూజలు



పలుకూరులో ఉత్సవ విగ్రహం, కలశంతో వస్తున్న భక్తులు



రుద్రవరం: పార్వతీదేవి



ముత్యాలపాడు: రాజరాజేశ్వరిదేవి



ఇంజేడులో బాల త్రిపుర సుందరీ



కోవెలకుంట్లలోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు

అమ్మవారు ఆశీర్వదించాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ శరన్నవరాత్రుల సందర్భంగా అందరినీ ఆశీర్వదించాలని తెదేపా నాయకుడు భార్గవ్‌రామ్ నాయుడు అన్నారు. గురువారం భార్గవ్‌రామ్ నాయుడిని చాగలమర్రి ఆర్యవైశ్య సంఘం నాయకులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆహ్వానించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకధార లక్ష్మణబాబు, సంఘం నాయకులు తొమ్మండ్రు మల్లికార్జున, సల్లా నాగరాజు, కృష్ణప్రసాదు, లోకేశ్, సుంకు శ్రీధర్ పాల్గొన్నారు.



ఆహ్వానపత్రిక అందుకుంటున్న భార్గవ్‌రామ్ నాయుడు

గాలివాన బీభత్సం

రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం, కొండమాయపల్లె, వెలగలపల్లె గ్రామాల్లో సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. విద్యుత్తు స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు స్తంభాల పునరుద్ధరణ పనులు చేపట్టారు. రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం, వేరుశనగకాయలు తడిసిపోయాయి.

సెలవుల్లో పాఠశాలల్ని నిర్వహించొద్దు



సీనియర్ అసిస్టెంట్ జయరాంనాయక్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సెలవులు ఇచ్చిందని, ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా పాఠశాలలను నడిపితే అటువంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు శశిధర్‌రెడ్డి డిమాండు చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఉప విద్యాశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జయరాంనాయక్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



నగదును అందజేస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

ప్యాపిలి, న్యూస్‌టుడే: మండలంలోని మాధవరానికి చెందిన రాజశేఖర్ ఇల్లు ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయిందని తెలుసుకున్న తెదేపా యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. గురువారం లద్దగిరిలో ఆర్థిక సాయం అందజేశారు. ఇళ్లు కూలిన విషయాన్ని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పూర్తి నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఖాజాపీర్, మాధవరం స్వామి, కరణం రామ్ పాల్గొన్నారు.

అంబాపురంలో వీధి దీపాల ఏర్పాటు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: అంబాపురంలో నవరాత్రి సందర్భంగా వీధి దీపాలను బాగు చేయిస్తున్నట్లు సర్పంచి శ్రీనివాసులు యాదవ్ తెలిపారు. కూటమి వచ్చాక గ్రామంలో ప్రగతిదాయక పనులకు ఆస్కారమేర్పడిందన్నారు. రూ.1.74 లక్షలు ఖర్చు చేసి 134 వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచి శ్రీనివాసులు యాదవ్ తెలిపారు.

అక్రమమద్యం స్వాధీనం

డోన్, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయాలు చేస్తుండటంతో దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అరెస్టుచేసినట్లు గ్రామీణపోలీసులు తెలిపారు. ఉంగరానిగుండ్లకు చెందిన సునీల్ 41 మద్యం సీసాలు కలిగి ఉండటంతో దాడులు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోటకొండ(రుద్రవరం), న్యూస్‌టుడే: కోటకొండలో 45 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి మద్యాన్ని విక్రయిస్తుందని తెలుసుకుని సోదాలు చేశామన్నారు. 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్, బొలేరో ఢీ..తప్పిన ప్రమాదం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల నుంచి ముదిగేడు వెళ్లే దారిలో ట్రాక్టర్, బొలేరో వాహనాలు గురువారం రాత్రి ఢీకొన్నాయి. కోవెలకుంట్ల నుంచి ముదిగేడుకు ఎరువులతో ట్రాక్టర్ వెళ్తుండగా అదే మార్గంలోనే కోవెలకుంట్ల నుంచి తాడిపత్రి వెళ్తున్న బొలేరో వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

సేవాపన్ను ఊసేదీ..?

☛ వసూలైతే..పురోగతికి బాటలు

☛ పట్టించుకోని రైల్వేశాఖ



డోన్ రైల్వే స్టేషన్

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: రైల్వేశాఖలో డోన్ రైల్వే స్టేషన్ ప్రధానమైన కూడలి. ఇది ఎంతో పేరు పొందింది. ఇటువంటి రైల్వే కూడలి నుంచి పురపాలక సంఘానికి సేవా పన్ను రావడం లేదు. రైల్వేశాఖకు తెలిసినా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సేవా పన్ను చెల్లించకుండా విస్మరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సేవా పన్ను విధించి వసూలు చేస్తే పట్టణంలోని ప్రజలతో పాటు రైల్వే వినియోగదారులకు సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం కలిగేదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పురపాలక సంఘంలో నిధులు లేక, జనరల్ ఫండ్ అంతంతమాత్రం ఉండటంతో అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ఏటా దాదాపు రూ.10 లక్షల వరకు ఆదాయం రావాల్సి ఉన్నా...రావడం లేదు. ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నామని పుర అధికారులు చెబుతున్నారు.

వినతిపత్రం ఇచ్చినా..

డోన్ పట్టణం మేజర్ పంచాయతీ నుంచి 2005లో మున్సిపాల్టీగా, 2017లో సెకండ్ గ్రేడ్ మున్సిపాల్టీగా హోదా పొందినా..రైల్వే నుంచి సేవా పన్ను రాబట్టలేక పోతోంది. సేవాపన్ను వసూలైతే ప్రగతిపనులకు ఆస్కారం ఉంటుంది. మున్సిపాల్టీ రెవెన్యూ విభాగం అధికారి, ఆర్ఐ, సిబ్బంది స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లకు కలసి 33.33 శాతం సేవా పన్ను చెల్లించాలని డిమాండు పత్రాన్ని అందించారు. ఆ ప్రతిని గుంతకల్లు డివిజన్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది.

పుర అధికారులు కలిశారు

–జి.వెంకటేశ్వర్లు, రైల్వే స్టేషన్ మేనేజర్, డోన్

డోన్ రైల్వే నుంచి మున్సిపాల్టీకి సేవా పన్ను చెల్లించాలని డిమాండు పత్రాన్ని ఇచ్చేందుకు మున్సిపాల్టీ అధికారి, సిబ్బంది వచ్చారు. వారు తెచ్చిన పత్రాన్ని గుంతకల్లు డివిజన్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించాం.

చెల్లించడం లేదు

– వెంకటరెడ్డి, ఆర్వో, డోన్

కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన రైల్వే, తపాలా తదితర సంస్థలు సేవాపన్ను చెల్లించాలని ఉత్తర్వులు ఉన్నా..చెల్లించడం లేదు. గుంతకల్లు డివిజన్‌లోని పలు రైల్వే స్టేషన్లకు సంబంధించి సేవా పన్ను చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. కానీ ఫలితం లేదు. రైల్వే వారే శానిటేషన్, తాగునీరు, రోడ్లు, కాల్వలు వంటి సౌకర్యాలు కల్పిస్తోంది. మున్సిపాల్టీకి సేవా పన్ను ఎందుకు చెల్లించాలంటున్నారు. ఉన్నత న్యాయస్థానం రైల్వేశాఖ పన్నులపై 33.33 శాతం సేవా పన్ను చెల్లించాలని తీర్పు ఇచ్చింది. కానీ రైల్వే మాత్రం పట్టించుకోవడం లేదు. సేవా పన్ను వసూలైతే అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

పైపులు బాగు చేయించాలి

కోవెలకుంట్ల గ్రామీణం: పెద్దకొప్పెర్ల: పెద్దకొప్పెర్లలోని చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలో పైపులకు రంధ్రాలు పడి నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. అధికారులు చర్యలు తీసుకుని పైపును బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వల్లంపాడు: వల్లంపాడులోని మారేమ్మ దేవాలయం సమీపంలో మూడు రహదారుల కూడలి వద్ద గోతులు పడి ప్రమాదకరంగా పరిస్థితి మారింది. అధికారులు చర్యలు తీసుకుని గుంతలు పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వృత్తివిద్యలో నైపుణ్యం సాధించాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: వృత్తివిద్యలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పాఠశాల తాత్కాలిక ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. వృత్తి విద్యను అభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవుల సందర్భంగా సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.